ఇదేం తీరు.. ఇవేం గొడవలు!

వరంగల్ నేతలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్

రంగంపేట, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వర్గపోరును అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించింది. ఇక్కడి ప్రజాప్రతినిధుల తప్పటడుగులపై ఆగ్రహంగా ఉంది. గీసుకొండ మండలం ధర్మారంలో ఏర్పడిన ఫ్లెక్సీ వివాదంలో దాడులు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? దీని వెనుక ఎవరెవరు ఉన్నారు? కిందిస్థాయి కార్యకర్తలను కట్టడి చేయాల్సిన ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నేరుగా గీసుకొండ పోలీసు స్టేషన్‌కెళ్లడం తదితర కీలక అంశాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వద్దకు నివేదిక చేరింది. మరోవైపు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ముఖ్య నాయకులు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపదాస్ మున్షిని కలిసి మంత్రి సురేఖ వ్యవహరిస్తున్న తీరు గురించి వివరించినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు మంత్రి సురేఖ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గీసుకొండ పోలీసు స్టేషన్‌లో జరిగినవి, ధర్మారంలో పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులు తదితర అంశాలు వివరించినట్లుగా సమాచారం. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉమ్మడి జిల్లా రాజకీయాలు హైదరాబాద్ కేంద్రంగా నడిచాయి. బుధవారం సీఎం, పీసీసీ అధ్యక్షుడిని కలిసేందుకు ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

'మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యత ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అధిష్ఠానం అప్పగించింది. ఒకటి, రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది'

పార్టీకి నష్టం: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య దూరం పెరగడంపై కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు సీరియస్‌గా ఉన్నారు. చిన్నా చితక విషయాలు పెద్దవి చేసి తరచూ గొడవ పడటం వల్ల పార్టీకి నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గాంధీ భవన్‌లో వ్యాఖ్యానించినట్లుగా తెలిసింది.

ఆర్టీసీ పండగ చేసుకుంది..!

●14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం



దసరా ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

- వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.
- అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.
- 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..
- మొత్తం 50 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే


హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

డిపోల వారీగా వివరాలు

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)	తిరిగిన కి.మీ(లక్షల్లో)	ఓ.ఆర్ (శాతం)
హనుమకొండ	3.73	6.72	81
జనగామ	3.38	6.16	94
వరంగల్ 1	4.67	7.82	83
వరంగల్ 2	3.93	7.16	86
మహబూబాబాద్	2.03	3.46	103
నర్సంపేట	2.84	4.92	96
పరకాల	2.23	3.79	98
తొర్రూరు	3.29	5.52	104
భూపాలపల్లి	2.85	4.75	97

సిబ్బంది, అధికారుల కృషి వల్లే..

- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్



ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

ప్రజలకు మెరుగైన సేవలందేలా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 2,66,664 మంది లబ్ధిదారులకు 506 రేషన్ దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 919 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల కాలంలో అవకతవకలకు పాల్పడిన ఏడుగురు డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి దుకాణాలను సీజ్ చేశామన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అదనపు పాలనాధికారి సంధ్యారాణి, ఇన్‌ఛార్జి డీఎస్‌వో ఉమారాణి, డీఎం సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న 'దిశ' సమావేశం: వరంగల్ జిల్లా 'దిశ' (జిల్లా అభివృద్ధి సహకార, మానిటరింగ్ కమిటీ) సమావేశం ఈ నెల 18న కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ఉంటుందని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

యార్డులో కాంటాల తనిఖీ


పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి నిర్మల

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పత్తి ఎక్కువ మొత్తంలో వస్తోంది. సీసీఐ పత్తి కొనుగోళ్లు ఇంకా ప్రారంభించకపోవడంతో.. రైతులు విక్రయించేందుకు పత్తిని మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఈక్రమంలో వ్యాపారులు తూకాల్లో అవకతవకలకు పాల్పడకుండా.. మార్కెట్ కార్యదర్శి నిర్మల మంగళవారం మార్కెట్‌లోని కాంటాలను పరిశీలించారు. పంట ఉత్పత్తుల తూకం కచ్చితంగా ఉండాలని దడువాయిలకు, ఇతర మార్కెట్ సిబ్బందికి ఆమె సూచించారు. గ్రేడ్-2 కార్యదర్శి రాము, సూపర్‌వైజర్లు ఉన్నారు.

క్రమంగా తగ్గుతున్న పత్తి ధర

ఎనుమాముల మార్కెట్‌లో పత్తి ధర క్రమక్రమంగా తగ్గుతోంది. ఈ సీజన్ మొదట్లో క్వింటా పత్తి రూ.7,500 పలకగా.. మంగళవారం క్వింటా రూ.6,900కు పడిపోయింది. గతేడాది క్వింటాకు రూ.9 వేలు, అంతకు ముందు ఏడాది క్వింటాకు గరిష్ఠంగా రూ.14 వేల రికార్డు ధర పలికింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పత్తి ధర తగ్గుముఖం పడుతోంది. అయితే పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉన్నందుకే మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభిస్తే.. పోటీపెరిగి.. రైతులకు మద్దతు ధర దక్కే అవకాశాలున్నట్లు రైతు సంఘాలు వెల్లడిస్తున్నాయి.

సూపర్‌వైజర్ల విధుల్లో మార్పు

ఎనుమాముల మార్కెట్: ఎనుమాముల మార్కెట్‌లో వివిధ యార్డుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ల విధుల్లో మార్పులు చేశారు. ఈమేరకు మార్కెట్ కార్యదర్శి నిర్మల సూపర్‌వైజర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొందరు సూపర్‌వైజర్లు తమకు ఇంతకాలం పనిచేసిన యార్డుల్లోనే విధులు కేటాయించాలని కోరుతూ.. మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకుడి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సూపర్‌వైజర్ల విధుల్లో మార్పులు, పత్తి కొనుగోళ్లకు సంబంధించి లక్ష్మీపురంలోని కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి, ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి జేడీఎం చర్చించినట్లు తెలుస్తోంది.

అద్దె భారం..

● ఇబ్బందిపడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

భవనాలకు తాళం


వరంగల్ ఉర్సుగుట్ట డీకే నగర్ పక్కనున్న జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాల/కళాశాల భవనానికి యాజమాని తాళం వేయడంతో బయటే ఉండిపోయిన అధ్యాపకులు

కరీమాబాద్, న్యూస్‌టుడే

తమకు రావాల్సిన భవనాల అద్దెలు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో మంగళవారం జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల భవనాలకు యజమానులు తాళాలు వేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉదయం 7 గంటలకే వరంగల్ ఉర్సుగుట్ట డీకేనగర్ పక్కనున్న మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాల/కళాశాల భవనానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి కుమారస్వామి తాళం వేశారు. దీంతో సుమారు 60 మందికి పైగా ఉన్న అధ్యాపకులు భవనం గేటు ముందే నిలబడిపోయారు. ప్రిన్సిపల్ అంజిరెడ్డి భవన యజమాని కుమారస్వామితో మాట్లాడినా.. ఆయన గేటు తాళం తీయలేదు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సంస్థ కార్యదర్శి సైదులు భవన యజమాని కుమారస్వామితో ఫోన్‌లో మాట్లాడారు. అద్దె బకాయిలు చెల్లించడానికి దస్త్రాలు పంపించామని 10 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సుమారు గంట తర్వాత గేటుతాళం తీశారు. దీంతో అప్పటి వరకు బయటే ఉండిపోయిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ గురుకులంలోకి వెళ్లారు. దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో ఇబ్బంది కలగలేదు.

● ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపల్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. భవన యజమానితో చర్చించాక సమస్య పరిష్కారమైందన్నారు. నేటి నుంచి యథావిధిగా తరగతులు సాగుతున్నాయని వివరించారు.

చెన్నారావుపేటలో



చెన్నారావుపేట: దుగ్గొండి మండలానికి సంబంధించిన సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం చెన్నారావుపేటలో అద్దె భవనంలో కొనసాగుతోంది. గత 18 నెలల నుంచి సుమారు రూ.45 లక్షల కిరాయి రావాల్సి ఉండటంతో వసతి గృహానికి తాళం వేసినట్లు యజమాని కంది గోపాల్‌రెడ్డి తెలిపారు.


దుగ్గొండిలో..



దుగ్గొండి: ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ గిర్నిబావిలోని జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాల గేటుకు యజమాని రాజేందర్‌రెడ్డి మంగళవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ మల్లయ్య గురుకుల పాఠశాలల ఆర్సీవో రాజ్‌కుమార్‌తో అద్దె చెల్లింపుల విషయాన్ని మాట్లాడి పది రోజుల్లో చెల్లించేందుకు హామీ ఇవ్వడంతో యజమాని రాజేందర్‌రెడ్డి తాళం తీశారు.

ఐనపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పులే గురుకులం అద్దె బకాయిలు రాలేదని మంగళవారం యజమాని కృష్ణారావు గేటుకు తాళం వేశారు. ఏడు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

– ఖానాపురం న్యూస్‌టుడే




నర్సంపేటలో గిరిజన బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలకు తాళం పెడుతున్న భవన యజమాని కృష్ణమూర్తి, బయట ఉన్న అధ్యాపకులు

నర్సంపేట: నర్సంపేటలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల భవనం ద్వారానికి యజమానులు తాళాలు పెట్టారు. మార్కెట్ బైపాస్ రోడ్డు చేరువలోని (మూడుచెక్కలపల్లి) గిరిజన బాలికల ఆశ్రమ కళాశాల అధ్యాపకులను బయటకు పంపి భవన యజమాని నూకల కృష్ణమూర్తి తాళం వేశారు. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బాలుర కళాశాల వసతి గృహం, బాలికల పోస్టు మెట్రిక్ వసతిగృహం, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతిగృహం, గిరిజన బాలికల కళాశాల వసతిగృహం భవనాల యజమానులు షట్టర్లకు, ద్వారాలకు తాళాలు వేయడంతో మధ్యాహ్నం వరకు అధ్యాపకులు, వార్డెన్లు, విద్యార్థులు ఇక్కట్లకు గురయ్యారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు భవన యజమానులతో మాట్లాడి అద్దె బకాయిలు చెల్లిస్తామని చెప్పడంతో తాళాలు తీశారు.

కిస్తీలు చెల్లించడం కష్టమైంది

-నూకల కృష్ణమూర్తి, నర్సంపేట

నర్సంపేట: తన మూడంతస్తుల భవనాన్ని మూడుచెక్కలపల్లికి చెందిన గిరిజన బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలకు అద్దెకు ఇచ్చాను. ఒప్పందం చేసుకున్న ప్రకారం నెలకు రూ.1.60 లక్షల అద్దె వస్తుంది. గతంలో అద్దెను చెల్లించిన అధికారులు పది నెలలుగా చెల్లించనందున రూ.16లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. బ్యాంకు రుణం కిస్తీలు చెల్లించడం కష్టంగా ఉంది.

ఎంజీఎంలో ఐఎంఏ వైద్యుల నిరాహార దీక్ష



ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసి రెండునెలలైనా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ.. అక్కడి వైద్యులు చేపట్టిన నిరసనలకు మద్దతుగా ఎంజీఎంలో వైద్యులు ఒకరోజు దీక్ష చేశారు. ఐఎంఏ వరంగల్ బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం ఎంజీఎం ఆసుపత్రిలోని గాంధీ విగ్రహం ముందు వైద్యులు చేపట్టిన 12 గంటల దీక్షను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాళీ ప్రసాద రావు ప్రారంభించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.అన్వర్, కోశాధికారి డా.దిడ్డి శ్రావణ్, సీనియర్ వైద్యులు డా.విజయచందర్‌రెడ్డి, డా.కస్తూరి ప్రమీల, డా.సుదీప్, డా.బోజా, డా.నాగార్జునరెడ్డి, డా.వెంకటస్వామి, డా.నరేష్‌కుమార్, డా.అజిత్ అహ్మద్, డా.ప్రసన్న, డా.పోరళ్ల సమ్మయ్య, డా.తెలుగు రామకృష్ణ, జూనియర్ వైద్యుల సంఘం నాయకులు శ్రీనాథ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న డీఈవో జ్ఞానేశ్వర్, విద్యాశాఖ అధికారులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికైన జిల్లాలోని ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపునకు మంగళవారం వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో వివిధ కేటగిరీల్లో ఎంపికైన 263 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 9న నియామక పత్రాలు అందించారు. 10, 11న వీరంతా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు. అయితే వీరికి పాఠశాలలను కేటాయించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు మ్యాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ చేపట్టారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని అధికారులు తొలుత ప్రకటించారు. అనంతరం వాయిదా పడినట్లు ప్రకటించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నిర్వహించనున్నట్లు మళ్లీ సమాచారం ఇచ్చి ఆ మేరకు ప్రారంభించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.జ్ఞానేశ్వర్ పర్యవేక్షించారు. వివిధ కేటగిరీల్లోని 80 మంది నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. బుధవారం మిగతా ప్రభుత్వ, స్థానిక సంస్థల సెకండరీ గ్రేడ్ టీచర్లు, సాంఘికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఉదయం పది గంటలకు జడ్పీ కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబితా ప్రకటించకపోవడంతో ఆందోళన

విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాలతో నూతన ఉపాధ్యాయులు గందరగోళానికి గురయ్యారు. ఉద్యోగంలో చేరుతున్నామనే ఆశతో వివిధ ప్రాంతాల నుంచి సమయానికి కేంద్రానికి వచ్చిన వారికి కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు విద్యాశాఖ అధికారులు తెలపడంతో కంగుతిన్నారు. తదుపరి రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత సమాచారం అందిస్తామని తెలపడంతో వెనుదిరిగారు. మార్గం మధ్యలోకి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం కౌన్సెలింగ్ ఉంటుందని సమాచారం అందించడంతో మళ్లీ వెంటనే కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు డీఈవోతో వాగ్వాదానికి దిగారు. ముందస్తుగా కొత్త టీచర్ల జాబితా ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు. డీఈవో తన ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

'సీఎం కప్' టార్చ్ ర్యాలీ విజయవంతం చేయాలి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం నిర్వహించే సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి టీవీఎల్.సత్యవాణి తెలిపారు. ఉదయం 7 గంటలకు పోచమ్మ మైదాన్ కూడలి నుంచి ఎంజీఎం ఆసుపత్రి, ములుగురోడ్డు మీదుగా వేయి స్తంభాల దేవాలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం హనుమకొండ చౌరస్తా, పోలీసు కమిషనరేట్, అదాలత్ మీదుగా హనుమకొండ కలెక్టరేట్‌కు వరకు ఉంటుందన్నారు. క్రీడాకారులు, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధవారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి కాలంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం





ఆ బాధ తెలుసు కాబట్టే..

- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ

మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం చూశాక ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఈ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

లక్షన్నర మందికి

- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, ఫంక్షన్



హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాను. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం. ● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.



మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నాయని నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు



లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. జీవిల ఎన్ఐటీ ఆచార్యుడు సి.ప్రసాద్ తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.

ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇస్తారు. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలున్నాయి.

అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు. ● కుళ్లిన ఆహార పదార్థాలను చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నాలుగేళ్లుగా అన్నదానం

- నాల్లారపురం రాజు

మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోవడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని సేకరిస్తున్నా. హోటళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ ఛాలెంజ్, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సహృదయ ఆశ్రమం, సాయి అనాథ సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హౌజ్ ఆఫ్ జాయ్ ఉంటాయి..

ఈ జాగ్రత్తలు తీసుకుందాం

● బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
● ఆకుకూర కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
● బ్రెడ్ గడువులోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
● దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకొని తెచ్చుకోవాలి.
● తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి
● పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
● ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా వృథా అరికట్టవచ్చు.
● అదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
● ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
● ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమానులను ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

పదిహేను సంవత్సరాలుగా

- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం



పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకుల్ల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడపత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.

ఇంటి ఆహారంలోనే..

- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డేపల్లి



ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పోషకాలు ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడుపోని కూరగాయలు వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.

ప్రజల్లో అవగాహన పెరిగింది..

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్



ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

అంకెల్లో వివరాలు..

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో	10
ఇంటిలో..	1
హాస్టళ్లలో..	2
హోటళ్లలో	3
ఇతర	2



రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మించారు. రుణం వస్తుందని ఆశపడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిచాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువ చేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఓదేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ. 39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెస్సై భాను ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http:///waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం

● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ నగరంలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం

టాస్క్‌ఫోర్స్

చేసినా చర్యలు శూన్యం.

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షల చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ చుట్టూ 15 నుంచి 20 ఎకరాల వరకు సమీప రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకొని సాగు చేసుకుంటున్నారు.

● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మర్రిచెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.

● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.

● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.

● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

హద్దులను నిర్ణయిస్తాం..

- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ణయించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తే. . సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనీల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి నాంది అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్‌గా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తరించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా.. ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, అధ్యాపకురాలు శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244





మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సమ్మారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

మరిపెడ, న్యూస్‌టుడే: దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంతో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండాప్రకాష్

సమస్యల పరిష్కారానికి కృషి

గీసుకొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరపున పోటీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి మంగళవారం శాయంపేట హవేలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వంచనగిరిలోని ఆదర్శ పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్య ఓటును తనకు వేయడంతోపాటు తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గఫార్, మండల అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రావు పాల్గొన్నారు.

దళిత కులాలు ఏకం కావాలి


కాశీబుగ్గ అంబేడ్కర్ కూడలిలో..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న 59 దళిత కులాలను ఐక్యం చేసి వారి అభివృద్ధి కోసం పాటుపడతామని తెలంగాణ దళిత ఫెడరేషన్(టీడీఎఫ్) ప్రకటించింది. కాశీబుగ్గలో తెలంగాణ దళిత ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో తెలంగాణ దళిత ఫెడరేషన్ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో మాదిగ, మాల, ఉపకులాల అభ్యున్నతి కోసం మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రూ.100 కోట్లు కేటాయించి దళిత వర్గాలకు మేలు చేయాలని కోరారు. జిల్లా నాయకులు అనిల్, కర్ణాకర్, ప్రేమ్‌సాగర్, అశోక్, రాజు, రఘుపతి, సురేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరసన

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: తనను ప్రేమ వివాహం చేసుకున్నాడనే కారణంతో భర్త ఎండీ హుస్సేన్‌ను చంపేశారని.. తగిన విచారణ చేసి న్యాయం చేయాలని సంధ్యారాణి మంగళవారం ఖిలావరంగల్ పడమరకోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నెల 10న మద్యంమత్తులో స్నేహితుడు శివ ఇంటి వద్ద కిందపడి చనిపోయాడని చెబుతున్నారని, అనుమానం ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తగిన విచారణ చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

సభ్యత్వ నమోదులో చరిత్ర సృష్టించాం


మామునూరులో యువతికి సభ్యత్వం అందిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రవికుమార్

మామునూరు, పర్వతగిరి: భాజపా సభ్యత్వ నమోదు అత్యధికంగా చేపట్టి చరిత్ర సృష్టించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. మంగళవారం ఖిలా వరంగల్, ఐనవోలు, పర్వతగిరి మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు భాజపాలో చేరారు. తిరుపతిరెడ్డి, కేశవరెడ్డి, ఏకాంతం, శ్రీధర్, కన్నయ్య పాల్గొన్నారు.

సేవా వెల్ఫేర్ సొసైటీ రక్తదాన శిబిరం


ఎంజీఎంలో..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: సేవా వెల్ఫేర్ సొసైటీ ఆరో వార్షికోత్సవం, భారత మాజీ రాష్ట్రపతి డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఎంజీఎం ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో శిబిరం నిర్వహించినట్లు సంస్థ కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ తెలిపారు. 20 మంది రక్తదానం చేయగా.. దాతలకు ఎంజీఎం రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డా.ఆశాదేవి, డా.అభిలాష్ ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్న ప్రణయ్, కోశాధికారి సందీప్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కదిలిన అధికారులు

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే


వరంగల్ ఓసీనగర్‌లో ఇటీవల సరఫరా అయిన కలుషిత నీరు

నెలరోజులుగా వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు కాలనీల్లో రంగు మారిన, కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీల ప్రజలు బల్దియా సమావేశ మందిరం ఎదుట కలుషిత నీటి సీసాలతో నిరసన తెలిపారు. అనంతరం పలువురు మహిళలు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాలతో ఇంజినీర్లు ఆగమేఘాలపై కాలనీల్లో తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కుళాయిల ద్వారా సరఫరా అయిన తాగునీరు పరిశీలించారు. క్లోరిన్ శాతం ఎంత ఉంది?, రంగుమారిన నీళ్లా?, కలుషితమైనవా? అని చూశారు. ఫిర్యాదులు చేస్తేనే గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు కదులుతారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 10రోజుల క్రితమే ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో తాగునీటి పరీక్షలు ముమ్మరం చేశారు.

మోతాదు పెంచేశారు

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యంగా గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు దృష్టి సారించారు. ధర్మసాగర్ చెరువులో నిరంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. హనుమకొండ వడ్డేపల్లి, కేయూసీ, వరంగల్ దేశాయిపేట ఫిల్టర్‌బెడ్లలో తాగునీటి శుద్ధీకరణ కోసం రసాయనాలు మోతాదు(డోస్) పెంచేశారు. ఆలం, బ్లీచింగ్, క్లోరిన్ మోతాదు ఎక్కువగా వినియోగిస్తున్నారు.


పాపయ్యపేటలో తాగునీటి పరీక్షలు చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్

మూడంచెలుగా పరీక్షలు..

తాగునీటి పరీక్షలు మూడంచెలుగా చేస్తున్నారు. ఒకటి ఫిల్టర్‌బెడ్, రెండోది సర్వీస్ రిజర్వాయర్లు(వాటర్ ట్యాంకులు), మూడోది కాలనీల్లో క్షేత్రస్థాయి(టెలెండ్)లో క్లోరిన్ శాతం పరిశీలిస్తున్నారు. ఎక్కడైనా క్లోరిన్ శాతం తక్కువైతే వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నారు.

> **నిర్భయంగా తాగొచ్చు**
>
> **- ప్రవీణ్‌చంద్ర, ఎస్ఈ, గ్రేటర్ తాగునీటి సరఫరా విభాగం**
>
> కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని నగర ప్రజలు నిర్భయంగా తాగొచ్చు. ఎటువంటి వాసన, రంగు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. వరంగల్ నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యంగా తగిన ప్రణాళిక రూపొందించాం.

> **మేమున్నాం.. మీకు తోడుగా**
> నర్సంపేట: 99635 59929, కార్పొరేషన్: 98484 09191, వర్ధన్నపేట: 99896 42307, వరంగల్ ఈస్ట్: 97053 46535 (10 AM TO 1 PM)
>
> **కార్పొరేషన్, న్యూస్‌టుడే:** వరంగల్ ప్రాంతం 25వ డివిజన్ బొందలకుంటలో బీజీఎం 2/1 వీధిదీపం వారం రోజులుగా వెలగడం లేదు. **- స్థానికులు, బొందలకుంట**
>
> **సమాధానం:** రెండు రోజుల్లో బాగు చేయిస్తాం. **- నరేష్, ఏఈ, ఎలక్ట్రికల్**
>
> **సమస్య:** వరంగల్ ప్రాంతం 11వ డివిజన్ బీఎస్ఎన్ఎల్ కేపీరెడ్డి గల్లీ బీఎస్ఎన్ఎల్ ఐ/2 వీధిదీపం రెండు నెలలుగా వెలగడం లేదు. **- స్థానికులు, కేపీరెడ్డి గల్లీ**
>
> **సమాధానం:** మూడు రోజుల్లో బాగు చేయిస్తాం. **- నరేష్, ఏఈ, ఎలక్ట్రికల్**
>
> **సమస్య:** వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ రామన్నపేట పెద్దమోరీ వద్ద చెత్తను తరలించడం లేదు **- ఎం.సరిత, పాపయ్యపేట**
>
> **సమాధానం:** సక్రమంగా తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్యాంరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

నకిలీ అనుమతితో అక్రమాలు



మాట్లాడుతున్న వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

శివనగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల పేరిట పరిశ్రమలు స్థాపించి, అందులో భాగస్వాములైన బడా వ్యాపారులు కోట్లాది రూపాయల రాయితీలు పొందుతున్నారని, వివరాల సహా పేరిట ప్రభుత్వాన్ని, బ్యాంకులను మోసం చేస్తున్నారని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ ఆరోపించారు. మంగళవారం శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా రాష్ట్రంలో పరిశ్రమల శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీల పేరిట ఉన్నత వర్గాలకు చెందినవారు అనేక రైస్‌మిల్లులు స్థాపించారని ఆరోపించారు. ఇవన్నీ తామే సమాచార హక్కు చట్టం ద్వారా వెలికితీసినట్లు వివరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో సుమారు 40 మిల్లులు కేవలం ఎస్సీ, ఎస్టీల అభ్యర్థుల పేరిట అనుమతి తీసుకుని ఉన్నత వర్గాలు ప్రభుత్వం నుంచి అన్నిరకాల రాయితీలు పొందారన్నారు. సమావేశంలో హైకోర్టు న్యాయవాది, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి యశ్వంతకుమార్, న్యాయ సలహాదారు రంగరాజు ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, శ్రీనివాసులు, సభ్యులు కార్తీక్, రాజేష్, జానీ, కోరిమల్ల తదితరులు పాల్గొన్నారు.

బాలికలు సాధికారత సాధించాలి

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: బాలికలు ఉన్నత విద్య అభ్యసించి అన్నిరంగాల్లో రాణిస్తూ.. సాధికారత సాధించాలని జెండర్ నిపుణురాలు రమాదేవి తెలిపారు. బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖిలావరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికా దినోత్సవం ప్రత్యేకత వివరించారు. బాలికల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మిక, వేధింపుల చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, శైలేంద్రకుమార్, వెంకటరమణ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడి ఆత్మహత్య

నేర సమాచారం

మామునూరు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం మామునూరు గ్రామానికి చెందిన సంగారపు కుమారస్వామి (67) కిరోసిన్ డీలర్‌గా పని చేశారు. ప్రభుత్వం డీలర్‌షిప్‌లను రద్దు చేసి డబ్బులు ఇవ్వక పోవడంతో అప్పుల బాధతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. అతడి కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి


చిరంజీవి (పాతచిత్రం)

మట్టెవాడ, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ప్రవహిస్తున్న నీటిలో పడిన వ్యక్తి మృతిచెందిన ఘటన మట్టెవాడ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ గోపీరెడ్డి కథనం ప్రకారం.. వరంగల్ డాక్టర్స్‌కాలనీ-2 సమీపంలోని గాంధీనగర్‌కు చెందిన గూడ చిరంజీవి(39) వాహన చోదకుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నెల 14న డాక్టర్స్‌కాలనీ కాకతీయ కెనాల్‌లో కాలకృత్యాల కోసం దిగి ప్రమాదవశాత్తు పడిపోయాడు. కెనాల్ వద్ద చిరంజీవి ద్విచక్ర వాహనాన్ని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గాలింపు చర్యలు చేపట్టగా.. మంగళవారం గీసుగొండ బాలయ్యపల్లె కెనాల్ వంతెన వద్ద చిరంజీవి మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళా కానిస్టేబుల్..


ధరణి(పాత చిత్రం)

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జోరుక ధరణి(25) అనే మహిళా కానిస్టేబులు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈ నెల 13న పోలీసు వసతి గృహ సముదాయంలో ఆమె అగ్ని ప్రమాదానికి గురైన విషయం విదితమే. ప్లాస్టిక్ సీసాలో తెచ్చుకున్న పెట్రోలు గదిలో ఉండగా లీకేజీ ఏర్పడి మంటలు చెలరేగడంతో ఆమె గాయాలపాలైంది. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ధరణి 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబులు.

అనుమానాస్పద స్థితిలో..


నితిన్ (పాతచిత్రం)

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం వంచనగిరి గ్రామంలో కొల్లూరి నితిన్ (18) అనే యువకుడు మంగళవారం మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దేశాయిపల్లిలో ఉంటున్న నితిన్ తల్లి హంసాబాయి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వంచనగిరిలో ఉంటున్న తాత నర్సింగరావు వద్ద ఉంటూ నితిన్ గీసుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నితిన్ మంచంలో విగత జీవిగా కన్పించాడు. అతని మెడకు దొడ్డు గొలుసుతో ఉరి వేసినట్లు చారలు కన్పించాయి. కొడుకు మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు హంసాబాయి గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.మహేందర్ ఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నితిన్ మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్థులు అంటున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం


గణేష్ (పాతచిత్రం)

నెక్కొండ, న్యూస్‌టుడే: పండగ రోజు జరిగిన గొడవలో కొంత మంది యువకులు కలిసి దాడి చేయడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అప్పల్‌రావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బురుపాటి గణేష్(22) డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 13న గ్రామానికి చెందిన పృథ్వీ, సతీష్, ప్రవీణ్, కొయ్యల సతీష్; శ్రీను, సుమన్, కొయ్యల సుమన్ అనే వ్యక్తులు గణేష్‌పై దాడి చేశారు. మనస్తాపానికి గురైన గణేష్ ఈ నెల 14న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.

మృతురాలి ఆచూకీ లభ్యం

మామునూరు, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళా ఆచూకీ లభ్యమైంది. ఈ నెల 12న అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో ఆచూకీ తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు అనంతరం మృతురాలి వివరాలు సేకరించారు. ఐనవోలు మండలం నర్సింహులగూడెంకు చెందిన కట్కూరి పుల్లమ్మ (45)గా గుర్తించారు. కొంత కాలంగా శంభునిపేటలో నివాసముంటున్నారని మామునూరు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

సట్టా నిర్వాహకురాలి అరెస్టు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: నగరంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన ఓ మహిళ సట్టా నిర్వహిస్తుండగా.. మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో రూ.5,100 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

చెల్లిపై దాడి.. కేసు నమోదు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: చెల్లిపై అన్న దాడి చేసిన ఘటన శంభునిపేటలో చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ కాలనీకి చెందిన పోలెపాక అరుణ అన్న పోలెపాక మస్తాన్ ప్రైవేటు కాంట్రాక్టరుగా ఉపాధి పొందుతున్నారు. ఇటీవల మస్తాన్ భార్యతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. తన భార్యను తీసుకు రావాలని పలుమార్లు చెల్లికి చెప్పాడు. అయినా ఆమె స్పందించకపోవడంతో ఈ నెల 10న మద్యంమత్తులో చెల్లి ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు.

ఎస్సైని దూషించిన యువకులపై..

మట్టెవాడ, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సైని దూషించిన యువకులపై ఇంతెజార్‌గంజ్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. మట్టెవాడ సీఐ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాఫిక్ ఎస్సై యాదగిరి విధుల్లో భాగంగా సోమవారం రాత్రి తపాలా ప్రధాన కార్యాలయం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో నల్గొండ జిల్లాకు చెందిన కోడె శ్రీకాంత్, ఊడే దినేష్ మద్యంతాగి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. సదరు యువకులను ఆపి వివరాలు అడుగుతున్న క్రమంలో మద్యంమత్తులో విధులకు ఆటంకం కలిగిస్తూ.. వ్యక్తిగత దూషణకు పాల్పడ్డారు. ఇంతెజార్‌గంజ్ ఠాణా పోలీసులు యువకులను ఠాణాకు తీసుకెళ్లారు. ఎస్సై యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నలుగురికి జైలు

నర్సంపేట, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు చోదకులకు నర్సంపేట రెండో తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తి కొత్త లక్ష్మీనారాయణ ఐదు రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. నర్సంపేట కానిస్టేబుల్ రవి తెలిపిన ప్రకారం.. ఇటీవల పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టగా వల్లభ్‌నగర్‌కు చెందిన సురేందర్, కొత్తగూడ మండలం ఓటాయి నివాసి సంతోష్, సర్వాపురానికి చెందిన అరుణ్, ఇందిరానగర్ వాసి మహమ్మద్ అహ్మద్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పై తీర్పు ఇచ్చారు.

జూద కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: జూద కేంద్రంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... ఎనుమాముల మార్కెట్ శివారుల్లో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎనుమాముల పోలీసులతో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. జూదం ఆడుతున్న ఏడుగురిలో ఒకరు పారిపోగా.. ఆరుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.15,930 నగదు, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు, విచారణ కోసం ఎనుమాముల ఠాణాలో అప్పగించామన్నారు.


క్వారీల్లో అధికారుల తనిఖీలు

సంగెం, న్యూస్‌టుడే: మండలంలోని లోహిత గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ మెటల్స్ అండ్ బిల్డర్స్, అనిల్‌కుమార్‌ల క్వారీల్లో మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. క్వారీ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా అని తనిఖీ చేసినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. క్వారీల్లో బాంబులు పేల్చినప్పుడు తమ పంట పొలాల్లో బండరాళ్లు పడుతున్నాయని, దుమ్మూధూళితో పంట ఉత్పత్తులు నాణ్యత కోల్పోతున్నాయని స్థానిక రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తనిఖీల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీవో కొమురయ్య, నీటిపారుదల శాఖ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

గుట్కా పొట్లాలు స్వాధీనం

దుగ్గొండి, న్యూస్‌టుడే: దుగ్గొండి మండలం స్వామిరావుపల్లిలో రాజమౌళి కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా రూ.17,600 విలువైన గుట్కా పొట్లాలు లభ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గుట్కాలను సీజ్ చేసి రాజమౌళిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ఖానాపురం: బుధరావుపేట ఆదర్శ పాఠశాలలో


చెన్నారావుపేట సిద్ధార్థ గురుకులంలో

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉపాధ్యాయులు ఉద్బోధించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం


వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ప్రిన్సిపల్ వెంకటయ్య

పారా ఒలింపిక్స్ పతక విజేతకు సన్మానం



పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జీవాంజి దీప్తిని మంగవారం ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఆమె తల్లిదండ్రులు ధనలక్ష్మి, యాదగిరిలను సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



గీసుకొండ, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం జాతీయ ఆదర్శ గ్రామమైన మరియపురానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచిగా ఎంపికయ్యారు. తిరుపతికి చెందిన అకాడమీ ఆఫ్ గ్రాస్ రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చి ఆఫ్ ఇండియా (అగ్రసీ) సంస్థ రాజీవ్ గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డు 2023కు ఆయనను ఎంపిక చేసింది. సంస్థ ఛైర్‌పర్సన్ డి.భారతీ సుందర్ ఈ మేరకు బాలిరెడ్డికి లేఖను పంపించారు. ఈ నెల 17న తిరుపతిలో ఈ అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంగళవారం బాలిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

అసత్య ప్రచారాలకు పాల్పడితే చర్యలు

రాయపర్తి, న్యూస్‌టుడే: వైద్యులపై దుష్ప్రచారం చేయడం సరికాదని మండల వైద్యాధికారి ప్రతీక్ అన్నారు. మంగళవారం ఆయన విధుల్లో నిద్రపోతున్నట్లు ఉన్న చిత్రం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టగా.. దానిపై స్పందించారు. అప్పటికే సుమారు 50 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చానని. మెడ నరాల సమస్యతో ఇబ్బంది పడుతూ కొద్దిసేపు సేద తీరుతుండగా..' ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యుకుడిని కాపాడిన పోలీసులు

మడికొండ: మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన యువకుడిని మడికొండ పోలీసులు కాపాడారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం మదనపల్లికి చెందిన రాసమల్ల రమేశ్ (27) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల దసరాకు ఇంటికి వచ్చిన అతను పండగ రోజు రాత్రంతా కుటుంబ సభ్యులతో గొడవపడ్డారు. ఆవేశంతో వాట్సాప్ వీడియో, సూసైడ్ నోట్ రాసుకుని మడికొండ శివారు అయోధ్యపురం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని మంగళవారం ఉదయం వచ్చారు. స్థానికులు గమనించి 100కు ఫోన్‌చేయడంతో బ్లూకోల్ట్స్ హెడ్ కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసు అక్కడకి చేరుకొని అతడికి నచ్చచెప్పి ఠాణాకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి అప్పజెప్పారు.

పేదల పక్షపాతి ఓంకార్

మాదన్నపేట(నర్సంపేట గ్రామీణం), న్యూస్‌టుడే: నైజాం నియంతృత్వ పాలనపై దివంగత ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ వీరోచితంగా పోరాడారని ఎంసీపీఐయూ నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కె.రాజమౌళి అన్నారు. మాదన్నపేటలో మంగళవారం జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన ఓంకార్ చేసిన పోరాటాలను వివరించారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఓంకార్ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు సదానందం, సాంబయ్య, రాజేందర్, అనసూయ, రవి, వీరస్వామి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ గ్రూపు-ఐజీసీ శిబిరానికి విద్యార్థి


హనీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలోని విజ్‌డమ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఉప్పు హనీ సాంస్కృతిక విభాగంలో మంచి ప్రతిభ కనబర్చి ఇంటర్ గ్రూపు(ఐజీసీ) శిబిరానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ జహంగీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబర్ 9 వరకు హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఎన్‌సీసీ శిబిరంలో సాంస్కృతిక విభాగంలో మంచి ప్రతిభ కనబర్చిందన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని ఆర్థికంగా, సామాజికంగా, చితికిపోయిన ఉద్యమకారుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఐకాస డివిజన్ కన్వీనర్ అంబటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. నర్సంపేటలోని ఓ వేడుకల మందిరంలో మంగళవారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమకారుల హక్కులు, ఆకాంక్షల సాధనకు సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఉద్యమకారులు రామచందర్, జావిద్, సాయికుమార్, అరుణ, ప్రణయ్‌దీప్, రవీందర్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు అండగా నిలుస్తున్న పోలీసులు

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అక్రమార్కులకు అండగా నిలుస్తూ రాజకీయ వివక్ష ప్రదర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, భారాస రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గంలో పోలీసుల వైఖరితో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాకు మంగళవారం లేఖ రాయడమేగాక దానిని పత్రికలకు విడుదల చేశారు. అధికార పార్టీ వారి తరపున వచ్చే ఫిర్యాదులు స్వీకరిస్తూ భారాస, ఇతర పార్టీలవారిపై అమర్యాదగా ప్రవర్తిస్తున్నారన్నారు. వీరి అక్రమాలపై అన్ని రకాల ఆధారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పెద్ది పేర్కొన్నారు.

బోధన రుసుం బకాయిల విడుదల కోరుతూ ధర్నా



నర్సంపేట, న్యూస్‌టుడే: బోధన రుసుం, ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యజమానులు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సాగర్, రమేశ్, రాంరాజ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కృష్ణవేణికి అందించారు. ధర్నాలో రవీందర్, మల్లేశం, రాజేశ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపిక


మోడెం విక్రమ్

దుగ్గొండి, న్యూస్‌టుడే: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన మోడెం విక్రమ్ ఆలిండియా స్థాయిలో 48వ ర్యాంకు సాధించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన విక్రమ్ ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తగా ఎదగాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. చెన్నారావుపేట ఠాణాను మంగళవారం ఏసీపీ సందర్శించి పరిసరాల ప్రాంతాన్ని, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. నెక్కొండ సీఐ చంద్రమోహన్, ఎస్సై రాజేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.